సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 13 । జూన్ । 2025



రాజకీయ క్రీడకు కోచ్ బలి

రాజకీయ క్రీడకు ఓ హాకీ కోచ్ బలైపోతున్నారు. మైదానంలోకి అడుగుపెట్టనీయడం లేదు.

- 8లో



కాటేసే కాలం

ఖరీఫ్ పనులు మొదలయ్యాయి. పాముకాట్లపై అప్రమత్తంగా ఉండాలి.

- 8లో

నేడు రైల్వే గేట్ల మూసివేత

టెక్కలి: టెక్కలి రైల్వేస్టేషన్ సమీపంలో గేటుతో పాటు గోపీనాథపురంలో గల రైల్వే గేటును శుక్రవారం మూసివేస్తున్నట్లు సిగ్నల్ విభాగం ఎస్ఎస్ఈ ఆర్.జి.శర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాంకేతిక పనులు చేపడుతున్న నేపథ్యంలో 13 వ తేదీ రాత్రి 9 గంటల నుంచి 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు గేటును మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారంతా సహకరించాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

నవోదయ 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ఎంట్రన్స్ కోసం జూలై 29లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బేతనసామి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎంట్రన్స్ పరీక్ష 2025 డిసెంబర్ 13న జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ప్రభుత్వ లేదా ప్రభుత్వంతో గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో 5వ తరగతి చదివి ఉండాలని తెలిపారు.

ప్రధానమంత్రి బాల పురస్కార్ దరఖాస్తుకు గడువు పెంపు

శ్రీకాకుళం అర్బన్: జాతీయ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్–2025కి సంబంధించి దరఖాస్తుల గడువును జూలై 31 వరకు పొడిగించారని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు బి.శాంతిశ్రీ తెలిపారు. ఈ మేరకు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తాజా ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. సాంస్కృతికం, సమాజ సేవ, విజ్ఞానం, సాంకేతికం, పర్యావరణం వంటి రంగాలలో అసాధారణ ప్రతిభ కనబర్చిన 5–18 ఏళ్ల లోపు బాలలు ఈ అవార్డుకు అర్హులని తెలిపారు. బాలలు స్వయంగా గానీ సంస్థల ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసేందుకు అవసరమైన వ్యక్తిగత వివరాలు, ప్రతిభకు సంబంధించిన ధ్రువపత్రాలు, సర్టిఫికెట్లు, పత్రికల్లో ప్రచురితమైన వార్తల క్లిప్పింగ్స్ వంటి ఆధారాలతో పాటు http://awards.gov.in/registration/signUp పోర్టల్ ద్వారా జూలై 31లోపు నమోదు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి బి.శాంతిశ్రీ తెలిపారు. అవార్డు కోసం అర్హులైన బాలలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

వైఎస్సార్‌సీపీ నిరసన కార్యక్రమం వాయిదా



ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అహ్మదాబాద్‌లో జరిగిన విషాదకర విమాన ప్రమాదం నేపథ్యంలో, శుక్రవారం శ్రీకాకుళం పట్టణంలోని కలెక్టరేట్ వద్ద తలపెట్టిన నిరుద్యోగ భృతి, ఫీజు బకాయిలపై నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేశామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. విద్యార్థులు, యువత సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం తాత్కాలికంగా ఆపినట్లు తెలిపారు. కొత్త తేదీ త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. విషాద ఘటన నేపథ్యంలో బాధిత కుటుంబాలకు గౌరవం తెలుపుతూ నిరసనను వాయిదా వేయాలని నిర్ణయించామని తెలిపారు.

సాక్షి కార్యాలయంపై దాడి హేయం

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ స్వరూప్



ఎం.వి స్వరూప్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): టీడీపీ నాయకులు సాక్షి కార్యాలయంలోకి చొరబడి దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ స్వరూప్ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. పత్రికలపై దాడులు, పార్టీ నాయకులపై వేధింపులకు పాల్పడి గొంతు నొక్కాలని చూడడం సరికాదన్నారు.

తడబడిన తొలి అడుగు



శ్రీకాకుళంలోని బలగ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రేయర్‌లో పాల్గొన్న బాలబాలికలు

సామాన్లు రాని స్టూడెంట్ కిట్లు.. డబ్బులు పడని తల్లికి వందనం.. పాలిష్ చేయని సన్న బియ్యం.. వెరసి బడులు తెరిచిన తొలిరోజే సర్కారు తడబడింది. తల్లికి వందనంపై ఊరించి ఉసూరుమనిపించింది. గత ఏడాది వరకు స్కూలు తెరిచిన తొలిరోజు విద్యా కానుక కిట్లు ఇచ్చేవారు. పిల్లలంతా సంతోషంగా పుస్తకాలు, బ్యాగులు, షూలు తీసుకుని ఇంటికెళ్లేవారు. కానీ ఈ ఏడాది ఆ కళ తప్పింది.

- పాఠశాలలు పున:ప్రారంభం
- అంతా గందరగోళం
- తొలిరోజే ఉసూరుమనిపించిన కూటమి సర్కారు
- 'తల్లికి వందనం' జీఓతో సరి
- పూర్తిస్థాయిలో రాని కిట్లు
- బదిలీల కారణంగా బాధ్యతలు స్వీకరించని టీచర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ:

బడులు తెరుచుకున్న తొలి రోజే కూటమి సర్కారు ఉసూరుమనిపించింది. వేసవి సెలవుల అనంతరం ప్రైవేటు పాఠశాలలతో సహా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు పూర్తిస్థాయిలో గురువారం పునఃప్రారంభమయ్యాయి. గత ఏడాది వరకు ఠంచన్‌గా బడి తెరిచినరోజే అన్ని వస్తువులతో కూడిన జగనన్న విద్యాకానుక పంపిణీతో ప్రభుత్వ బడుల్లో పండగ వాతావరణం నెలకొని ఉండేది. కానీ ఈ ఏడాది మాత్రం పూర్తిగా భిన్నంగా తయారైంది. ఎక్కడా అలాంటి సందడి వాతావరణం కనిపించలేదు. పిల్లలకు కనీసం పుస్తకాలు కూడా ఇవ్వలేదు.

స్టూడెంట్ కిట్లు.. ఇస్తే ఒట్టు

స్టూడెంట్స్ కిట్స్‌ను అందజేయడంలో కూటమి సర్కారు ఘోరంగా విఫలమైంది. పాఠశాలలు తెరిచిన తొలిరోజు స్టూడెంట్ కిట్‌లోని వస్తువులు అందజేస్తామని చెప్పి అటు విద్యార్థులను, ఇటు తల్లిదండ్రులను కూటమి ప్రభుత్వం ఉసూరుమనిపించింది. పూర్తిస్థాయిలో యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, బూట్లు, సాక్స్‌లు, బ్యాగులు అందజేయకపోవడంతో సగం కిట్‌లను బాలబాలికలకు అందజేయలేక ఉపాధ్యాయులు చేతులెత్తేశారు. దీనికి తోడు బదిలీలు జరుగుతుండడంతో టీచర్లు కూడా తగు సంఖ్యలో లేరు.



శ్రీకాకుళంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ చేయకుండా ఉన్న స్టూడెంట్ కిట్ సామగ్రి



శ్రీకాకుళంలోని గొంటివీధిలో ఉన్న నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ఫర్నీచర్‌లేక నేలపైన కూర్చున్న చిన్నారులు

తల్లికి వందనం హడావుడి..

బడి తెరిచిన రోజు తల్లికి వందనం ఇస్తామని హడావుడి చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు రోజంతా ఆశగా చూశారు. జీఓ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవడంతో నిరాశ చెందారు. అటు ముఖ్యమంత్రి, ఇటు విద్యాశాఖ మంత్రి చెప్పిన మాటలన్నీ గాలిమాటలేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సన్నబియ్యమంటూ అబద్ధాలు..





కొత్త విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో సన్నబియ్యంతో డొక్కా సీతమ్మ పేరిట (గతంలో గోరుముద్ద పేరిట అందించేవారు) మధ్యాహ్న భోజనం అందిస్తామని కూటమి ప్రభుత్వ పెద్దలు సెలవిచ్చారు. తీరా వాస్తవ రూపంలోకి వెళ్తే.. గతంలో ఇచ్చిన బియ్యమే మేలంటూ కార్మికులు నివ్వెరపోతున్నారు. ముందు ఇచ్చిన బియ్యాన్ని 25 కేజీల ప్యాకెట్లుగా చేసి పాలిష్ చేసి చిన్నసైజ్‌గా మార్చారనే నగ్నసత్యాన్ని మధ్యాహ్న భోజన కార్మికులే గుర్తిస్తున్నారు.

గతంలో బడి తెరిచిన రోజే ఇచ్చేవారు..



నేను మున్సిపల్ హైస్కూల్‌లో టెన్త్‌క్లాస్ చదువుతున్నాను. గతంలో బడి తెరిచిన మొదటి రోజే విద్యాకానుకతో స్టూడెంట్ కిట్ ఇచ్చేవారు. పాఠ్యపుస్తకాలు, నోట్స్‌లు కూడా తొలిరోజే ఇచ్చేవారు. ఈసారి ఎందుకలా ఇవ్వలేదో మాకు తెలీదు. ఎప్పుడిస్తారో తెలియడంలేదు. – షేక్ తన్వీనర్ బేగమ్, చిన్నబొందిలీపురం, శ్రీకాకుళం

స్టూడెంట్ కిట్ ఇస్తారనుకున్నాం..



నేను శ్రీకాకుళంలో మున్సిపల్ హైస్కూల్‌లో చదువుతున్నాను. ఇప్పుడు పదో తరగతికి వచ్చాను. మొదటిరోజు స్టూడెంట్ కిట్ ఇస్తారని ఆశగా ఎదురు చూశాం. కొన్ని వస్తువులు రాలేదని అన్నారు. – కొమ్ము నందిని, హడ్కోకాలనీ, శ్రీకాకుళం

ముందు అందజేసిన రైస్‌లాగే ఉంది..



బడికి తొలిరోజు వచ్చాము. హ్యాపీగా ఉంది. అయితే సన్న బియ్యంతో కూడిన భోజనం పెడతారని చెప్పారు. తీరా చూస్తే పెద్ద తేడా ఏమీలేదు. – కరణం శిరీష, ఎచ్చెర్ల మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని

తొలి రోజు సగం మందే..

జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలు 3 వేలకు పైగా ఉండగా వీటిల్లో తొలిరోజు 50 శాతం మంది విద్యార్థులు బడులకు హాజరయ్యారు. ఆన్‌లైన్ డేటా ప్రకారం 2561 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1,26,420 మంది చదువుతున్నారు. వీటిలో తొలిరోజు 2407 బడుల పిల్లల హాజరును తీసుకోగా.. మరో 154 పాఠశాలల విద్యార్థుల డేటా తీసుకోలేదు. 61,973 మంది విద్యార్థుల తొలిరోజు బడికి హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య ధ్రువీకరించారు.

టెన్త్ సప్లిమెంటరీలో మరోసారి నిరాశ

- 77.84 శాతంతో రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లోనూ శ్రీకాకుళం నిరాశ పరిచింది. గురువారం ఈ ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 77.84శాతం ఉత్తీర్ణతను సాధించారు. దీంతో జిల్లా రాష్ట్రస్థాయిలో 12వ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ పరీక్షలు మే 19 నుంచి నెలాఖరు వరకు జరిగాయి. మే 31 నుంచి జూన్ 3వ తేదీ వరకు స్పాట్ వాల్యుయేషన్ జరిగింది.

4000 మంది ఉత్తీర్ణత..

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు పునర్విభజన శ్రీకాకుళం జిల్లా నుంచి 5139 మంది హాజరుకాగా 77.84 శాతం ఉత్తీర్ణతతో 4000 మంది పాసయ్యారు. ఇందులో బాలురు 3090 మంది హాజరుకాగా.. 2347 మంది ఉత్తీర్ణులు కాగా, బాలికలు 2049 పరీక్షలు రాయగా 1653 మంది పాసయ్యారు. ఈసారి బాలికలే పైచేయి సాధించారు. బాలురు 75.95 శాతం, బాలికలు 80.67 ఉత్తీర్ణతను సాధించారు. బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ అనే విద్యాశాఖ అధికారిక వెబ్‌పోర్టల్‌లో షార్ట్ మార్క్స్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య పేర్కొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



మాట్లాడుతున్న రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

పాతపట్నం: జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, పనులను పూర్తి చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. పాతపట్నం బాలాజీ నగర్‌లో ఉన్న ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో గురువారం సీపీఐ జిల్లా 25వ మహాసభలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, విద్యార్థులు, యువకులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గిరిజనులు పండించే పంటకు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, సనపల నర్సింహులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాసరావు, మండల కార్యదర్శి దూసి శారద, దూసి భాస్కరరావు, నాయకులు ఆదినారాయణ ఆచారి, మోహనరావు, సింహాచలం, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గం ఎన్నిక

సీపీఐ జిల్లా కార్యదర్శిగా చాపర వెంకటరమణ, అదనపు కార్యదర్శిగా లండ వెంకటరావు, కార్యవర్గ సభ్యులుగా చాపర సుందర లాల్, పలింగ నారాయణ స్వామి, పుక్కల్ల ఆరెల్లమ్మ, కే.సంతోష్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర సహాయ కార్యవర్గ సభ్యులు తెలిపారు.

గొట్టాను పరిశీలించిన ఒడిశా అధికారి



కాలువను పరిశీలిస్తున్న అధికారి నాగమోహన్

హిరమండలం: స్థానిక గొట్టా బ్యారేజీ స్థితిగతులను భువనేశ్వర్‌కు చెందిన చీఫ్ ఇంజనీర్ నాగమోహన్ గురువారం పరిశీలించారు. రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు జలాల వివాదాల నేపథ్యంలో ఒడిశా చీఫ్ ఇంజనీర్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. గొట్టా బ్యారేజీలో ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను తెలుసుకున్నారు. ఈ బ్యారేజీ ద్వారా సాగునీటి ప్రవాహంతో పాటు కుడి, ఎడమ ప్రధాన కాలువల పరిస్థితిపై ఆరా తీశారు. ఏటా ఖరీఫ్, రబీ సాగు లక్ష్యాన్ని సైతం తెలుసుకున్నారు. స్థానిక వంశధార అధికారులు ఇక్కడి పరిస్థితిని వారికి వివరించారు. ఆయన వెంట నరసన్నపేట వంశధార డీఈ ప్రదీప్, ఇతర వంశధార సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన



మండలంలోని అల్లెన గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం నిరసన తెలిపారు. రేషనలైజేషన్‌లో భాగంగా గ్రామంలోని పాఠశాలలోని 6,7,8 తరగతులను వేరే పాఠశాలలో కలపడంతో వీరంతా ఆందోళన వ్యక్తం చేశారు. నాగావళి నదీ పరివాహక ప్రాంతమైన అల్లెన గ్రామంలో ఉన్న ఎంపీయూపీ స్కూల్ వేరే గ్రామానికి తరలించడంతో.. వానాకాలంలో పిల్లలు వెళ్లడానికి ఇబ్బంది ఎదురవుతుందని స్థానికులు తెలిపారు. పాఠశాలను ఆ గ్రామంలో కొనసాగించాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని వారంతా తెలిపారు. ఇప్పటికే ఈ సమస్యను విద్యాశాఖ అధికారులకు, కలెక్టర్‌కు సర్పంచ్ జె. మహేష్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసినట్లు వారంతా తెలిపారు. – బూర్జ





పాత నేస్తం.. కొత్త క్లాసు

బడి తలుపులు తెరుచుకున్నాయి. వేసవి తర్వాత పాత నేస్తాలంతా కొత్త తరగతిలో కలుసుకుని ముచ్చట్లు పెట్టుకున్నారు. చాన్నాళ్ల తర్వాత కలుసుకోవడంతో సందడిగా గడిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



ఏడాదిలో ప్రజలకు చేసిందేమీ లేదు

- మీడియా సమావేశంలో సీపీఎం నాయకులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిలో ప్రజలకు చేసిందేమీ లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, పి.తేజేశ్వర రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలన ఏడాదిలో ఏ మాత్రం సంతృప్తికరంగా లేదని, ప్రజలకు అప్పులు తప్ప ఆదాయం లేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని, జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని, వంశధార నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజీ ఇస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి చివరి భూముల వరకు సీరు అందిస్తామని, జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని చేసిన వాగ్దానాలు ఒక్కటి కూడా ఎందుకు అమలు చేయలేకపోయారో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటీడీఏ లేకపోవడం వల్ల గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, గిరిజనుల భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో జీడి రైతులు తీవ్రంగా దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార రిజర్వాయర్ పూర్తిచేసి చివరి భూముల వరకు రెండు పంటలకు నీరివ్వాలని, నేరడి వద్ద బ్యారేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అక్రమ మైనింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్గో ఎయిపోర్టు పేరుతో భూదోపిడీ ఆపాలని, సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టపెట్టొద్దని వారు డిమాండ్ చేశారు. కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

'విద్రోహ చర్యపై నిజాలు నిగ్గు తేల్చాలి'



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రసాద్, హిరమండలం ఎస్ఐ మహ్మద్ యాసిన్

హిరమండలం: కూర్మ వైదిక గ్రామంలో ఇస్కాన్ ఆశ్రమం అగ్నిప్రమాదంలో దగ్ధమైన సంగతి తెలిసిందే. బుధవారం అర్ధరాత్రి తర్వాత ప్రమాదంలో ప్రధాన ఆశ్రమం కాలిబూడిదైంది. 2018లో ఇక్కడ వైదిక గ్రామం ఏర్పాటైంది. విద్యుత్ వంటి ఆధునిక సదుపాయాలకు దూరంగా.. సనాతన ధర్మంతో పాటు ప్రాచీన సాగు విధానంతో ఇక్కడ కూర్మ గ్రామం గత ఏడేళ్లుగా విరాజిల్లుతోంది. ఈ క్రమంలో ఇక్కడ అగ్నిప్రమాదం సంభవించి ప్రధాన ఆశ్రమం దహనం కావడం సంచలనంగా మారింది. దీనిపై ఆశ్రమ నిర్వాహకులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూర్మ ఆధ్యాత్మిక గ్రామాన్ని పరిరక్షించాలని పోలీస్ యంత్రాంగాన్ని కోరుతున్నారు. ఈ క్రమంలో గురువారం అగ్నిప్రమాదం జరిగిన ఘటనా స్థలాన్ని కొత్తూరు సీఐ ప్రసాద్, హిరమండలం ఎస్ఐ మహ్మద్ యాసిన్ పరిశీలించారు. విశ్వహిందూ పరిషత్‌తో పాటు ధార్మిక సంఘాల ప్రతినిధులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటన వెనుక ఉన్న నిజానిజాలను బయటకు వెలికి తీయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలలను పనిలో చేర్చుకుంటే చర్యలు



నెహ్రూ యువకేంద్రం నుంచి ర్యాలీ

శ్రీకాకుళం అర్బన్: బాలలను కార్మికులుగా పనిలో చేర్చుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని బాలల సంరక్షణ అధికారి కేవీ రమణ అన్నారు. శ్రీకాకుళంలోని నెహ్రూ యువజన కార్యాలయం వద్ద జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, బ్రెడ్స్ సంస్థ, జిల్లా కార్మిక శాఖ, ఏహెచ్‌టీయూ, ఐసీపీఎస్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నెహ్రూ యువ కేంద్రం నుంచి డే నైట్ జంక్షన్ వరకు బాల కార్మికుల నియంత్రణపై అవగాహన ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ బాలలను కార్మికులుగా పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని, అలాగే ఎక్కడైనా అలాంటి పిల్లల్ని గుర్తిస్తే 1098 లేదా 112 కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు. జిల్లా యాక్సిస్టు జస్టిస్ ప్రోగ్రాం మేనేజర్ మజ్జి సింహాచలం మాట్లాడుతూ మన దేశాన్ని బాల కార్మిక రహిత దేశంగా తీర్చిదిద్దాలని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకులు భువన్ రిబ్బు ముఖ్య ఉద్దేశమని అన్నారు. జిల్లాని బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, వివిధ ప్రభుత్వ ఇతర సంస్థలు సమన్వయంతో పనిచేయడం జరుగుతుందన్నారు. కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 18 ఏళ్ల పిల్లలను పనిలో చేర్చుకోవద్దని సూచించారు.

క్లుప్తంగా

పశువుల తరలింపు అడ్డగింత

నరసన్నపేట: జాతీయ రహదారిపై అక్రమంగా గేదెలను తరలిస్తుండగా నరసన్నపేట పోలీసులు అడ్డుకున్నారు. బరంపురం నుంచి రాజమండ్రికి బొలెరో వ్యాన్‌లో ఐదు గేదెలను తరలిస్తుండగా మడపాం టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేశారు. గేదెలను అలమండ గోశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.4.95 లక్షలు



నీలమణి దుర్గ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ద్వారా రూ.4,95,520 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. 30 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ హుండీని గురువారం లెక్కించామని, టెక్కలి గ్రూపు దేవాలయాలు కార్యనిర్వహణాధికారి టి.పి.మనస్వి పర్యవేక్షించారన్నారు. కార్యక్రమంలో సుదర్శన్, శ్రీ వెంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి పాలకొండ రోడ్డులో ఏర్పడిన భారీ గోతిలో దిగబడిన ఆటో

కొత్తూరు: కొత్తూరులోని పాలకొండ రోడ్డులో త్రినాథ స్వామి ఆలయం వద్ద ఏర్పడిన భారీ గోతిలో గురువారం ఓ ఆటో దిగబడింది. వర్షం కారణంగా గోతుల్లో నీరు చేరడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పడిపోయిన సమయంలో ఆటో వెనుక ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ముగ్గురు తహసీల్దార్లకు బదిలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లకు బదిలీ చేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ జి–సెక్షన్ సూపరింటెండెంట్ జి.ఎల్.శ్రీనివాస్‌ను లావేరు తహసీల్దార్‌గా నియమించారు. పాతపట్నం తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్ రణస్థలం మండలం బదిలీ చేశారు. రణస్థలం తహసీల్దార్‌గా పనిచేసిన ఎం.ప్రసాదరావును పాతపట్నం తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు ఆలయాల్లో చోరీ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కనుగులవానిపేట గ్రామంలో గల పాదిలాపు అమ్మవారి గుడితో పాటు పక్కనే గల శ్రీ వెంకటేశ్వర ఆలయంలో బుధవారం అర్ధరాత్రి తర్వాత దొంగతనం జరిగింది. గురువారం ఉదయం ఆలయానికి వెళ్లిన పురోహితుడు తలుపులు బార్లా తెరిచి ఉండడడంతో గ్రామస్తులకు విషయం చేరవేశారు. వారు వెంటనే శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దొంగతనంలో రూ.2వేలు నగదుతో పాటు ఇతర త్రా వస్తువులు దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. గ్రామస్తులురాలు కనుగుల అశ్విని ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోదండరామ వీధికి చెందిన బలగ కృష్ణారావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వైపు కృష్ణారావు సైకిల్‌పై వెళ్తుండగా అదే మార్గంలో వస్తున్న లారీ సైకిల్ హ్యాండిల్‌కు తగలడంతో కృష్ణారావు తుళ్లి పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ వెళ్లిపోయాడు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి కేసునమోదు చేయనున్నట్లు తెలిపారు.

రాజకీయ క్రీడకు కోచ్ బలి

- జాతీయ స్థాయి హాకీ క్రీడాకారుడిపై టీడీపీ నేతల కక్ష సాధింపు
- స్టేడియంకు రాకుండా అడ్డుకుంటున్న వైనం

శ్రీకాకుళం రూరల్:

ఆయన మారుమూల ప్రాంతానికి మైదానం తీసుకువచ్చారు. మట్టిలో మాణిక్యాలను గుర్తించి నిఖార్సయిన హాకీ క్రీడాకారులుగా తయారు చేశారు. జాతీయ స్థాయి పోటీలకు అంపైర్‌గా వ్యవహరించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. కానీ ఇప్పుడు ఆయనను ఆ మైదానానికే రానివ్వడం లేదు. వైఎస్సార్ సీపీపై అభిమానం చూపించారనే కారణంతో కక్ష సాధిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని చాపురం పంచాయతీ అదే గ్రామానికి చెందిన అల్లు అనిల్‌కుమార్ హాకీ క్రీడాకారుడు. 15 ఏళ్లుగా ఇదే క్రీడలో ప్రావీణ్యం పొంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు. జాతీయ స్థాయి పోటీలకు అంపైర్‌గా, టెక్నికల్ అధికారిగా కూడా ఎంపికయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయనపై కక్ష సాధింపులకు దిగారు. దీంతో ఆయన ఇప్పుడు ఏకంగా ఆటకే దూరమయ్యారు. తనను ఏ మైదానంలోకి రానివ్వకుండా టీడీపీ నేతలు అధికారుల సాయంతో కుట్రలు పన్నుతున్నారని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు.



నేషనల్ హాకీ క్రీడలో విద్యార్థులతో కోచ్ అనిల్‌కుమార్

ఎందరినో తీర్చిదిద్దాను



నేను ఎందరో క్రీడాకారులను హాకీ క్రీడలో తీర్చిదిద్దాను. 8 మందిని జాతీయ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలో 70 మందిని ఆడించాను. జిల్లా కేంద్రంలో కూడా పాత్రునివలస మినీ స్టేడియంలో నా అధ్యక్షతన ఆడించాను. పాత్రునివలసలో స్టేడియం అభివృద్ధికి ఎంతో కృషి చేశాను. ఇప్పుడు జిల్లా కేంద్రంలోని ఏ మైదానానికి వెళ్దామన్నా నన్ను రానీయడం లేదు. స్థానికంగా గల స్పోర్ట్స్ అధికారులు తమపై రాజకీయ ఒత్తిడి ఉందని, స్టేడియంకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. – అల్లు అనిల్ కుమార్, హాకీ కోచ్

కొమనాపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



వేతనదారులను రహస్య విచారణ చేస్తున్న ఏపీడీ లోకేశ్

జలుమూరు: కొమనాపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ కనుసు ఉమారావుపై పూర్తి విచారణ చేసి డ్వామా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నామని నరసన్నపేట క్లస్టర్ ఏపీడీ కె.లోకేశ్ తెలిపారు. గురువారం కొమనాపల్లి సచివాలయంలో వేతనదారులతో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులు కనుసు రవి, గొల్లంగి సోమేశ్వరి, ఉమా, వాన శాంతమ్మ, పల్లి రమణమ్మ తదితరులను విచారించారు. ఫిర్యాదు చేసిన అంశాలలో ఎంత వాస్తవమో, రికార్డుల ప్రకారం ఉన్న వాటిని సరిచూస్తామన్నారు. విచారణ బహిరంగంగా నిర్వహిస్తామని నోటీసు ఇచ్చి రహస్యంగా నిర్వహించడంపై సర్పంచ్ కనుసు సీతమ్మ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కనుసు సీతారాం అసంతృప్తి వ్యక్తం చేశారు. నిజంగా ఫీల్డ్ అసిస్టెంట్ తప్పు చేస్తే అందరి సమక్షంలో విచారణ చేసి చేసిన తప్పులు రుజువైతే చర్యలు తీసుకోవాలే గానీ వారికి అనుకూలంగా ఉన్న వారితో ఉపాధి పనులలో తప్పులు చేసినట్లు చెప్పించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. క్లస్టర్ ఏపీడీ లోకేశ్ మాట్లాడుతూ బహిరంగ విచారణలో గొడవలు జరుగుతాయన్న ఉద్దేశంతో ఇలా రహస్య విచారణ చేస్తున్నామని తెలిపారు.

28.550 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు



పట్టుబడిన గంజాయి, ముద్దాయిలతో సోంపేట సీఐ మంగరాజు, కంచిలి ఎస్‌ఐ పారినాయుడు

కంచిలి: మండల కేంద్రంలోని సోంపేట రైల్వేస్టేషన్ క్వార్టర్స్ సమీపంలో బీహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు 28.550 కిలోల గంజాయిని తరలిస్తుండగా కంచిలి ఎస్‌ఐ పి.పారినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం ఉదయం చాకచక్యంగా పట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఈ విషయమై సోంపేట సీఐ బి. మంగరాజు, స్థానిక ఎస్‌ఐ పి.పారినాయుడులు విలేకరులతో మాట్లాడారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం రఘునాథ్‌పూర్ గ్రామానికి చెందిన అమెరికన్ పాశ్వాన్, కామేంద్ర రామ్‌లు గురువారం ఉదయం 9 గంటల సమయంలో ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా మీరాపల్లి గ్రామానికి చెందిన సంజిట్ అలియాస్ బబ్లు అనే వ్యక్తి నుంచి 28కిలోల 550 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి బీహార్ బయల్దేరారు. అక్కడ గయా రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి సాహిద్ ఆలం అలియాస్ అర్జున్‌కు అప్పగించడానికి వీరు ప్లాన్ సిద్ధం చేసుకున్నారు. దీని కోసం గురువారం వేకువజామున 4 గంటలకు ఇచ్ఛాపురం వద్ద సుమండి వరకు వచ్చి అక్కడి నుంచి హైవేలో గల లారీ ఎక్కి కంచిలి ఫ్లై ఓవర్ వద్ద దిగి, అక్కడి నుంచి కంచిలిలో రైల్వేస్టేషన్ చివరన గల రైల్వే క్వార్టర్స్ వద్ద గల రైల్వేపార్క్‌కు ఎడమ పక్కన గల బీటీ రోడ్డుపైకి 7.30 గంటలకు చేరుకుని గంజాయితో గల నాలుగు బ్యాగులతో హౌరా మెయిల్ ట్రైన్ కోసమై వేచి ఉండగా పోలీసులకు అనుమానం వచ్చి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 28 కిలోల 550 గ్రాముల గంజాయిని, ఒక కీ ప్యాడ్ మొబైల్ ఫోన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించినట్లు సీఐ మంగరాజు ఈ సందర్భంగా తెలిపారు.

కాటేసే కాలం



- ఖరీఫ్‌లో విషసర్పాలతో జాగ్రత్త
- వానాకాలంలో పాముల సంచారం ఎక్కువ



పొలం పనులు చేస్తున్న రైతులు

హిరమండలం: పొలం పనులు మొదలైపోయాయి. వానలు పడుతుండడంతో రైతులకు పొలాలకు వెళ్తున్నారు. అయితే ఈ కాలంలో రైతులు పాము కాటుకు గురవుతుంటారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఈ నెల నుంచి దాదాపు నవంబర్ వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- పొలాల గట్లమీద వెళ్లేటప్పుడు కర్రతో చప్పుడు చేస్తూ నడవడం మంచిది.
- రాత్రిపూట పొలాలకు నీరు కట్టడానికి వెళ్లినప్పుడు టార్చిలైట్ తీసుకుని వెళ్లాలి.
- ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలి.
- పాము కాటు కంటే చాలామంది షాక్‌తోనే ప్రాణం మీదకు తెచ్చుకుంటారు.
- ఇంట్లో వారు ధైర్యం చెప్పాలి.
- పాముకాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తం తో పాటు విషం వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటు పెడతారు అలా చేయకూడదు. ఒక్కోసారి పాము కాటు కన్నా ఆ గాయం ప్రమాదకరంగా మారవచ్చు.


పాముకాటు లక్షణాలు

- పాము కాటు వేసిన ప్రదేశంలో రెండు కోరల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది. పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు అనిపిస్తాయి.
- కళ్లు మగతగా శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు

పాములు విష ప్రభావం

కట్ల పాము: ఇది కాటేసిన క్షణాల్లోనే విషం రక్త కణాల్లో కలుస్తుంది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి.
నాగుపాము: ఇది కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది.
రక్తపింజర : ఇది కాటేసిన రెండు గంటల తర్వాత విషం శరీరంలోకి ఎక్కుతుంది.
జెర్రిపోతు, నీరుకట్ట: ఇది కాటేసినా విషం ఉండదు. కానీ చికిత్స తీసుకోవడం అవసరం.

అందుబాటులో ఇంజెక్షన్లు



పాముకాటు బారిన పడిన వారికి పీహెచ్‌సీల్లో చికిత్స అందుబాటులో ఉంటుంది. వారికి కావాల్సిన యాంటీ స్నేక్‌వీనం ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాటు కాటుకు గురైన వ్యక్తి ఆందోళన, భయం చెంద కుండా నిర్భయంగా ఉండాలి. గాయంపై భాగాన్ని వస్త్రంతో గట్టిగా లాగి కట్టి ఉంచాలి. వెంటనే ప్రథమ చికిత్స చేసి గాయాన్ని బట్టి రెండు సార్లు స్నేక్‌వీనం డోస్ తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదు. పాము కరిచిన వెంటనే ఏదైనా వాహనంలో ఆరోగ్య కేంద్రానికి చేర్చాలి. నడిపించకూడదు. – ఫారుక్ హుస్సేన్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, హిరమండలం

డ్వాక్రా డబ్బు స్వాహా..?

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 12వ వార్డు లక్ష్మీనగర్ వీధికి చెందిన మెప్మా ఆర్‌పీ లక్షల రూపాయల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు చెందిన పొదుపు మొత్తాలను స్వాహా చేసిన ట్లు సమాచారం. ఆ వార్డు పరిధిలో సుమారు 50 గ్రూపులకు చెందిన పొదుపు మొత్తాలను గత కొన్నేళ్లుగా వసూళ్లు చేసినట్లు సమాచారం. అయితే ఆ మొత్తాలను బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా ఆమె సొంతానికి వాడుకున్నారని గ్రూపు సభ్యులు ఆరోపిస్తున్నారు. రూ.6–7లక్షల వరకు వసూలు చేసి ఉండవచ్చని సమాచారం. మహిళలు కొంతమంది నిలదీస్తుండడంతో ఇటీవల ఆమె ఇంటికి తాళం వేసుకొని వేరే చోటుకు వెళ్లిపోయినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు మహిళా సంఘాల సభ్యు లు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై మెప్మా పీడీ ఎస్వీ రమణను సంప్రదించగా దీనిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.


ఏటీఎం కార్డు మార్చి రూ.29 వేలు లూటీ

టెక్కలి రూరల్: తన ఏటీఎం కార్డు మార్చి తన అకౌంట్‌లో నగదు కాజేశారని ఓ మహిళ టెక్కలి పోలీసులను ఆశ్రయించారు. అయితే నాలుగు రోజులుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆమె వాపోతున్నారు. బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని భగవాన్‌పురం గ్రామానికి చెందిన నారలోలాక్షి అనే మహిళ గత నెల 20 వ తేదీన టెక్కలిలో గల ఓ ఏటీఎంలో డబ్బులు తీసేందుకు వెళ్లారు. డబ్బులు ఎలా తీయాలో తెలియకపోవడంతో వెనుక ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి తన ఏటీఎం కార్డు ఇచ్చి రూ.7000 నగదును తియ్యమని తన పిన్ నంబర్ చెప్పారు. ఆ వ్యక్తి ఏటీఎం నుంచి నగదు తీసి కార్డు మార్చేశాడు. అనంతరం ఈ నెల 6వ తేదీన కార్డులో రూ.7 వేలు తీసినట్లు మెసేజ్ రావడంతో ఆమె ఆందోళనకు గురై బ్యాంకుకు వెళ్లారు. అకౌంట్ నుంచి మొత్తం రూ.29వేల నగదును పలాసలో ఓ ఏటీఎం నుంచి తీశారని చెప్పడంతో ఆమె ఈ నెల 8న టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు పట్టించుకోవడం లేదని ఆమె తెలిపారు. ఇదే విషయమై టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ వద్ద ప్రస్తవించగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్/నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలోని నెయ్యిలవీధిలో గురువారం రాత్రి తొమ్మిది మంది పేకాట శిబిరం నడుపుతూ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.1,55,680 నగదు, 8 మొబైల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నలుగురిపై పాత కేసులపై ఉన్నాయి. వైశ్యరాజు వరదరాజు అలియాస్ సురేష్ పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిని నరసన్నపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గుర్తు తెలియని మహిళ మృతి



మృతి చెందిన గుర్తు తెలియని మహిళ

ఎచ్చెర్ల: మండలంలోని జర్జాం గ్రామం సమీపంలో జాతీయ రహదారి పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని మహిళ గురువారం చికిత్స పొందుతూ శ్రీకాకుళం రిమ్స్‌లో మృతి చెందింది. ఈమెకు 60 ఏళ్లు ఉంటాయని వైద్య సిబ్బంది తెలిపారు. బుధవారం జర్జాం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న ఈమెను చూసిన స్థానికులు 108కు ఫోన్ చేయగా సిబ్బంది ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పాతపట్నం: పాతపట్నం మార్కెట్ వీధికి చెందిన రాయబిల్లి రామకృష్ణ (38) బుధవారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్‌ఐ ఎల్.అప్పారావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... పాతపట్నం మార్కెట్ వీధికి చెందిన రాయబిల్లి రామకృష్ణ, తన భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు కలిసి హైదరాబాద్‌లో ఉండేవారు. గత మూడేళ్ల నుంచి రామకృష్ణ, భార్య విడిగా ఉంటున్నాడు. రామకృష్ణ తాగుడికి అలవాటు పడ్డాడు. రెండు నెలలుగా పాతపట్నం వచ్చేసి, ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. మనస్తాపంతో ఈ నెల 11వ తేదీ రాత్రి ఇంట్లో ఫ్యాన్ హుక్‌కి ఉరి వేసుకున్నాడు. గురువారం ఉదయం ఇరుగుపొరుగు వారు రామకృష్ణ తల్లి శ్రీలక్ష్మికి విషయం తెలియజేయజేసి, పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే సీఐ రామారావు సంఘటన స్థలానికి వచ్చి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌సీకి తరలించి, పోస్టుమార్టం చేసి, తల్లి శ్రీలక్ష్మికి అప్పగించామని, మృతుడు తల్లి శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

యువకుడు బలవన్మరణం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని శీపన్నాయుడుపేటలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. సారవకోట మండలం బెజ్జిపురం గ్రామానికి చెందిన సంపతిరావు పెద్ద తవిటయ్యకు భార్య, వివాహమైన కుమార్తె, కుమారుడు సాయిలోహిత్ (23) ఉన్నారు. సాయిలోహిత్ నగరంలో పెయింటర్‌గా శీపన్నాయుడుపేటలో జీవిస్తున్నాడు. తల్లిదండ్రులిద్దరికీ గత రెండేళ్లుగా మనస్పర్థలు ఉండటంతో తల్లి తన వద్దనే నివసిస్తుంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం కోటబొమ్మాళి పండగల కోసం తల్లి వెళ్లారు. సాయంత్రం వచ్చి చూసేసరికి కుమారుడు సాయిలోహిత్ ఫ్యాన్ హుక్‌నకు ఉరి వేసుకుని కనిపించడంతో ఆమె నిర్ఘాంతపోయారు. చివరి ఆశతో రిమ్స్‌కు అంబులెన్సులో తరలించినా ఫలితం లేకపోయింది. బుధవారం రాత్రి 11 గంటలకు ఔట్‌పోస్టు నుంచి వచ్చిన సమాచారంతో సాయిలోహిత్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆగస్టులో ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్:

శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య 310 నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర స్థాయి బొత్స అప్పలస్వామి (మర్రివల స మాస్టర్) స్మారక పౌరాణిక, సాంఘిక, జానపద పద్యనాటక ఏకపాత్రాభినయ పోటీలు ఆగస్టులో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య సభ్యులు ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బంటుపల్లి రామచంద్ర దేవ్, చిట్టి వెంకటరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో జరిగే ఈ పోటీల్లో పాల్గొనే వారు నియమ నిబంధనలకు లోబడి పాల్గొనాలని కోరారు. ఎంట్రీ ఫీజు కింద రూ.300లు ఫోన్‌పే నంబరు 9440347848కు చెల్లించాలని, స్క్రూటినీ ద్వారానే అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. పౌరాణిక, జానపద, సాంఘిక పద్యాలతో కూడిన ఏకపాత్రలు అనుమతిస్తామన్నారు. జూలై 5లోగా ఎంట్రీలు నమోదు చేసుకోవాలని సూచించారు. బి.రామచంద్రదేవ్, పొట్నూరు వేంకటరావు, ఐ.రమణారావులను సంప్రదించాలని తెలిపారు. విజేతలకు రూ.5వేలు, రూ.3వేలు, రూ. 2 వేలు అందజేస్తామన్నారు.


ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



చీపురుపల్లి గ్రామంలోని నిర్వాసితుల శిబిరం

మెళియాపుట్టి: రేగులపాడు ఆఫ్‌షోర్‌కు గ్రామాన్ని ఇచ్చిన చీపురుపల్లి నిర్వాసితులలకు న్యాయం జరగాలంటే ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆఫ్‌షోర్ నిర్వాసితులు చేపట్టిన నిరాహార దీక్షలు 22వ రోజుకు చేరుకోవడంతో గురువారం చీపురుపల్లిలోని దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ హిరమండలం నిర్వాసితులకు ఇచ్చిన 460 జీఓ ప్రాప్తికి పూర్తిస్థాయి ప్యాకేజీలు ఇవ్వాలని కోరారు. వలస కూలీలుగా పలు ప్రాంతాలకు వెళ్లిన 132 మంది నిర్వాసితులకు ప్యాకేజీలు లేవని అన్నారు. డీ పట్టా భూములకు సొమ్ములు చెల్లించాలని అన్నారు. చెల్లింపుల్లో తేడాలు ఉన్నాయని వాటిని సవరించి ఇళ్లకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నిర్వాసితులందరూ ఏకతాటిపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరరావు, కొక్కిరి కిరణ్, ఉమాశంకర్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆదిత్యాలయ ఈఓ బాధ్యతల స్వీకరణ



ఈఓగా బాధ్యతలు చేపట్టిన కేఎన్‌వీడీవీ ప్రసాద్

అరసవల్లి: రాష్ట్ర దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయాలకు కొత్తగా ఆస్తులను సమకూర్చేలా చర్యలు చేపడతామని, తద్వారా ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామని ఆలయ ఈఓ కేశవమతం నాగవెంకట దుర్గా వరప్రసాద్ స్పష్టం చేశారు. అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వా మి ఆలయానికి కొత్త ఈఓ (డిప్యూటీ కమిషనర్)గా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కుటుంబసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆల య సిబ్బంది కలిసి గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం కొత్త ఈఓ ప్రసాద్ మాట్లాడుతూ అరసవల్లి ఆలయానికి కూడా పరిసర ప్రాంతాల్లో భూముల కొనుగోలు అంశం పెండింగ్‌లో ఉన్నట్లుగా సమాచారం ఉందని, దీన్ని త్వరితగతిన పూర్తి చేయించి తద్వారా ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని ప్రకటించారు. భక్తులకు ఆలయ పరిసరాల్లో ఎక్కడైనా అసౌకర్యం కలిగితే నేరుగా తనను సంప్రదించవచ్చునని స్పష్టం చేశారు.

మెగా ఉద్యోగ మేళాలో 263 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రిన్సిపాల్ దానేటి పద్మజా కామేశ్వరరావు, ఉరిటి సాయికుమార్

కాశీబుగ్గ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సూర్యతేజ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. 763 మంది హాజరుకాగా అందులో 263 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి మాట్లాడుతూ జాబ్ మేళాకి హాజరైన ప్రతి నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ పద్మజీ కామేశ్వరరావు మాట్లాడుతూ యువతలో ఉండాల్సిన నైపుణ్యాల ప్రాముఖ్యత గురించి వివరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ మాట్లాడుతూ దూరంతో సంబంధం లేకుండా అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్.కామేశ్వరరావు, పి.విఠల్‌రావు, బి.నాగరాజు, గాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో రెండు గంటలు..



ఎండలో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: రిమ్స్ వైద్య కళాశాల, ఆస్పత్రిలోని సెక్యూరిటీ, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఏజెన్సీ ప్రతినిధులను మండుటెండలో రెండు గంటల పాటు నిలబెట్టి సమావేశం నిర్వహించడం వివాదానికి తావిచ్చింది. వారం రోజుల కిందట కొత్త ఏజెన్సీకి ఔట్‌సోర్సింగ్, సెక్యూరిటీ గార్డుల నిర్వహణ బాధ్యత అప్పగించారు. ఈ ఏజెన్సీ ప్రతినిధులు బుధవారం మండుటెండలో సిబ్బందినందరినీ నిలబెట్టి సుమారు రెండు గంటల పాటు సమావేశం నిర్వహించి వీళ్లందరిలో క్రమశిక్షణ లేదని, వైద్యులు ఇతర ఉద్యోగులకు నమస్కరించడం లేదని, సమయపాలన పాటించడం లేదని చెప్పారు. దీంతో సెక్యూరిటీ గార్డులంతా తమ ఎంటయూలో రూ.18వేలు జీతాన్ని నమోదు చేశారని, గత ఏజెన్సీ రూ.పది వేలు మాత్రమే చెల్లిస్తూ వచ్చిందని, ప్రస్తుతం మీరెంతో చెల్లిస్తారో చెప్పాలని పట్టుబట్టారు. ఇలా మాటకు మాట పెరిగింది. అయితే ఏజెన్సీ ప్రతినిధులు ముగ్గురిపై రెండో పట్టణ పోలీసులుకు ఫిర్యాదు చేయడం తీవ్ర దుమారాన్ని లేపింది. గురువారం ఉదయం పోలీసులు నుంచి ఆ ముగ్గురిని స్టేషను వద్దకు రావాలని కబురురావడంతో సెక్యూరిటీ గార్డులంతా విధులకు హాజరుకాకుండా కాసేపు నిరసన తెలిపారు. అనంతరం విధులకు హాజరయ్యారు. కొందరు నాయకులను కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు.